నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 2 ఆగస్టు 2024 | KARIMNAGAR




హుజూరాబాద్: అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న దళితులు

# దళితబంధు ఇస్తరా.. ఇవ్వరా..?

- కరీంనగర్ జిల్లాలో నిత్యం ఆందోళనలు
- అయినా పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- రెండో విడుతకు అందని సాయం
- ఒక్క హుజూరాబాద్ నియోజవకర్గంలోనే 8,148 మంది ఎదురుచూపులు
- తాజాగా హుజూరాబాద్‌లో ధర్నా
- సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు

**దళితబంధు రెండో విడుత నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం తొక్కి పెడుతున్నది. దళితుల ఖాతాను ఫ్రీజ్ చేసి వారి జీవితాలతో ఆడుకుంటున్నది. కేసీఆర్ సర్కారు చేసిన ఆర్థిక సహాయాన్ని విడిపించుకోకుండా ఆంక్షలు విధించగా, హుజూరాబాద్ నియోజకవర్గ లబ్ధిదారులు ఆగ్రహిస్తున్నారు. రెండో విడుత డబ్బులు వస్తాయనే నమ్మకంతో అప్పులు తెచ్చి వ్యాపారాలు విస్తరించుకున్నామని, ఇప్పుడు ప్రభుత్వ వైఖరితో చిక్కుల్లో పడ్డామని ఆవేదన చెందుతున్నారు. తమ ఖాతాల్లో ఉన్న నగదును విడిపించుకోలేక, వ్యాపారాలు నిర్వహించుకోలేక ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు. ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. శుక్రవారం మరోసారి హుజూరాబాద్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దళితుల నోటికాడి బుక్కను రేవంత్‌రెడ్డి లాక్కోడానికి చూస్తున్నాడని తీవ్ర స్థాయిలో విరుచుకుడ్డారు. తమ డబ్బులు ఇవ్వకుండా ఆంక్షలు ఎందుకు విధించారని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని హెచ్చరిస్తున్నారు.**

కరీంనగర్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో గొప్ప ఉద్దేశంతో దళిత బంధు పథకాన్ని ప్రారంభించారు. హుజూరాబాద్ నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి మొదట ఇక్కడ అమలు చేశారు. 2021 ఆగస్టులో ఈ పథకాన్ని హుజూరాబాద్‌లోనే ప్రారంభించారు. అధికారులు సర్వే చేసి 18,021 కుటుంబాలను గుర్తించారు. ఈ కుటుంబాలన్నింటికీ ₹10 లక్షలు మంజూరు చేసి, ₹10 వేలు దళిత సంక్షేమ నిధికి జమచేసి మిగతా ₹9.90 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో వేశారు. అయితే, లబ్ధిదారులు ఇచ్చిన కొటేషన్ ప్రకారంగా వారి వ్యాపార అవసరాలను బట్టి ఆర్థిక సహాయం అందిస్తూ వచ్చారు. కొందరికి పూర్తి స్థాయిలో మరి కొందరికి ₹5 లక్షలు, ఇంకొందరికి ₹2.50 లక్షలు ఇలా ఎవరి అవసరాలను బట్టి వారు తమ బ్యాంకు ఖాతాల నుంచి విడిపించుకునే వెసులుబాటును అప్పటి ప్రభుత్వం కల్పించింది. కొందరికి ఒకేసారి పూర్తి స్థాయిలో, మరి కొందరికి రెండు విడుతల్లో వారి అవసరాన్ని బట్టి ఇస్తూ వచ్చింది. ఈ ప్రకారంగా గత అసెంబ్లీ ఎన్నికల వరకు హుజూరాబాద్ నియోజకవర్గంలో 9,873 మందికి పూర్తి స్థాయిలో ఆర్థిక సహాయం అందింది. ఇంకా 8,148 మందికి వివిధ స్థాయిలో ఆర్థిక సహాయం అందాల్సి ఉన్నది. రెండో విడుత ఆర్థిక సహాయం అందించేందుకు అధికారులు అవసరమైన కసరత్తు చేస్తుండగానే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి ఆగిపోయింది. ఆందోళన చెందిన దళితులు అధికారుల వద్దకు వెళ్లి ప్రశ్నించగా ఎన్నికల తర్వాత ఇస్తామని చెప్పారు. అదే విషయాన్ని నమ్మిన దళితులకు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి చూపుతున్నది.

### బ్యాంకు ఖాతాలపై ఆంక్షలు

కేసీఆర్ ప్రభుత్వంలో అమలైన దళితబంధు పథకంపై ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని చూపుతున్నది. లబ్ధిదారుల ఖాతాల్లో జమైన డబ్బును విడిపించుకోకుండా బ్యాంకుల ఖాతాలపై ఫ్రీజింగ్ పెట్టింది. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న హుజూరాబాద్ నియోజకవర్గంలోని హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల్లో 6,868 మందికి సంబంధించిన ₹256.76 కోట్లు, హన్మకొండ జిల్లా పరిధిలోని కమలాపూర్‌లో 1,280 మందికి ₹14.83 కోట్లు, మొత్తం 8,148 మంది లబ్ధిదారులకు ₹271.60 కోట్లపై ఆంక్షలు విధించింది. బ్యాంక్ ఖాతాల నుంచి నగదు విడిపించుకోకుండా ఫ్రీజింగ్ విధించింది. దీంతో దళితులైన లబ్ధిదారులు బ్యాంకులు, అధికారుల చుట్టూ నిత్య ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ రావాల్సిన రెండో విడుత దళితబంధు ఆర్థిక సహాయాన్ని అందించాలని వేడుకుంటున్నారు. అయినా, ఎవరూ పట్టించుకోవడం లేదు. దళితబంధు ఖాతాలపై ప్రభుత్వం ఫ్రీజింగ్ విధించిందని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే గానీ తామేమీ చేయలేమని అధికారులు, బ్యాంకర్లు స్పష్టం చేస్తున్నారు.

### ఆందోళనలో దళితులు

దళితబంధు రెండో విడుత ఆర్థికసాయం అందుతుందన్న నమ్మకంతో చాలా దళితబిడ్డలు తమ వ్యాపారాలను విస్తరించుకునేందుకు మంది అప్పులు చేశారు. కానీ, ఎనిమిది నెలలుగా నగదు విడిపించుకునే అవకాశం లేక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని, దుకాణాల అద్దెలు, కరెంట్ బిల్లులు కూడా చెల్లించే పరిస్థితి లేకుండా పోయిందని వాపోతున్నారు. మరో పక్క వ్యాపారాలు నడవక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిలిపివేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనేక సార్లు కరీంనగర్‌లోని కలెక్టరేట్‌కు వచ్చి ప్రజావాణిలో విజ్ఞప్తులు చేశారు. నేరుగా కలెక్టరేట్ ఎదుట పలు మార్లు ధర్నాలు చేశారు. తమ చేతిలో ఏమీ లేదని, ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు చెబుతుండగా, రాజకీయంగా ఒత్తిడి పెంచే లక్ష్యంతో లబ్ధిదారులు పలువురు మంత్రులను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. అయినా, ఫలితం కనిపించడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో విడుత ఆర్థిక సహాయం అందే వరకు నిత్యం పోరాటాలు చేయాలని నిర్ణయించుకున్నారు.

### హుజూరాబాద్‌లో ధర్నా

హుజూరాబాద్, ఆగస్టు 1: 'రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మేమంటే ఎందుకంత కక్ష. మా అకౌంట్లు ఎందుకు ఫ్రీజ్ చేసిన్రు. దళితబంధు రెండో విడుత డబ్బులు రాక, వ్యాపారాలు సాగక మా కుటుంబాలు ఆగమైతున్నయి. ఎప్పుడిస్తరో చెప్పాలి' అని హుజూరాబాద్‌లో దళితబంధు లబ్ధిదారులు ఆందోళన చేశారు. దళితబంధు రెండో విడుత బాధిత సాధన సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా, రాస్తారోకో చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా పెండింగ్‌లో ఉన్న రెండో విడుత డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తొలి విడుత వచ్చిన డబ్బులతో పలువురం వ్యాపారాలు పెట్టుకున్నామని, మిగతా డబ్బులు రాకపోవడంతో పెట్టుబడి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి డబ్బులు విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. 'సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్', 'దొంగల రాజ్యం.. దోపిడీ రాజ్యం' అంటూ నినాదాలతో హోరెత్తించారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోగా, పోలీసులు వచ్చి బలవంతంగా విరమింపజేసి, అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత వదిలిపెట్టారు. ఇక్కడ దళితబంధు రెండో విడుత సాధన సమితి సభ్యులు కోలుగూరి సురేశ్, కోలుగూరి నరేశ్, అకినపల్లి ఆకాశ్, ఇనుగాల బిక్షపతి, కోడెపాక రక్షిత్, దాసారపు నాగరాజు, మంద వేణు, రామంచ శ్రీకాంత్, పాత రాజేశ్, గాజుల కుమార్, మహంకాళి రమేశ్, విజయ్, సరిత, కుమార్ ఉన్నారు.


### దళితులపై కక్షగట్టింది



రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మా దళితులపై కక్షగట్టింది. మేం ఆర్థికంగా ఎదగడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇష్టం లేనట్టుంది. అందుకే రెండో విడుత ఇస్తలేదు. నేను మొదటి విడుత వచ్చిన రూ.5 లక్షలతో ఫొటో స్టూడియో(సీఐటీ పెట్టుకున్న. మిగతా డబ్బులు వస్తాయమో) ఆశతో అప్పుతెచ్చి రూ.2 లక్షలతో కొత్త మోడల్ కెమెరా కొన్న. ఇప్పుడు అప్పు కడుదామంటే రెండో విడుత డబ్బులు రావడం లేదు. ఎట్ల కట్టాలో తెలియడం లేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే మా సమస్య పరిష్కరించాలి.

**- కోలుగూరి నరేశ్, జమ్మికుంట**

### వెంటనే విడుదల చేయాలి




ఎన్నికలప్పుడు కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పుడు దళితులను మోసం చేస్తున్నది. దళితులను చిన్నచూపు చూస్తున్న రేవంత్‌రెడ్డికి మా ప్రతాపం చూపెడుతం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రెండో విడుత డబ్బులు వెంటనే విడుదల చేయాలి. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తం.

**- దాసారపు నాగరాజు, వీణవంక**

## రాళ్ల వాగుకు జలకళ



రాళ్లవాగు పరవళ్లు తొక్కుతున్నది. జగిత్యాల-నిజామాబాద్ జిల్లాల సరిహద్దులో కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేట శివారులోని ఉన్న ప్రాజెక్టులోకి రెండు రోజులుగా కురిసిన వర్షాలకు భారీగా నీరు చేరి కళకళలాడుతున్నది. మత్తడి దూకుతూ కనువిందు చేస్తున్నది., ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

**- కథలాపూర్, ఆగస్టు 1**



సిరిసిల్ల టౌన్: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**రేవంత్ డౌన్ డౌన్**



కథలాపూర్: రోడ్డుపై రేవంత్‌రెడ్డి దిష్టిబొమన్ను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# ఆడబిడ్డల ఉసురు తగుల్తది!

## రేవంత్ అనుచిత వ్యాఖ్యలపై మహిళా లోకం ఆగ్రహజ్వాల

- బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- ముఖ్యమంత్రి దిష్టిబొమ్మల దహనం

**రేవంత్, భట్టి క్షమాపణలు చెప్పాల్సిందే**



రేవంత్‌రెడ్డి చిత్రపటంతో నిరసన తెలుపుతున్న మహిళ

**అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై ఆడబిడ్డలు ఆగ్రహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిరసనలతో హోరెత్తించారు. ఎక్కడికక్కడ రేవంత్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. చిత్రపటాలను చేతపట్టుకుని 'సీఎం డౌన్ డౌన్' అంటూ నినదించారు. 'ఆయనే మా ఉసురు తగలి బస్టాండ్ పాలయితడు' అంటూ శాపనార్థాలు పెట్టారు. సీఎంతోపాటు పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే మహిళా ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.**



జగిత్యాలలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత, నాయకులు

కరీంనగర్, ఆగస్టు 1(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలైన సబితా ఇంద్రారెడ్డి, సునితా లక్ష్మారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భగ్గుమన్నారు. గురువారం ఉమ్మడిజిల్లావ్యాప్తంగా నిరసనలకు దిగారు. సీఎం దిష్టిబొమ్మలు దహనం చేశారు. నగర మేయర్ వై సునీల్ రావు ఆధ్వర్యంలో తెలంగాణచౌక్‌లో.. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో మానకొండూర్‌లో నిరసనలు తెలిపారు. గంగాధర మండలం మధురానగర్‌లో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, హుజూరాబాద్ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

- సిరిసిల్ల అంబేద్కర్ చౌక్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఇక్కడ నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతోపాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేములవాడలో జరిగిన నిరసనలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పాల్గొన్నారు.
- పెద్దపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద రాజీవ్ రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. పోలీసులు అడ్డుకొన్నప్పటికీ సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష పాల్గొన్నారు. రేవంత్ రెడ్డి వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు.
- జగిత్యాల తహసీల్ చౌరస్తా వద్ద జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొన్నారు. కోరుట్ల కార్గిల్ చౌరస్తా జాతీయ రహదారిపై సీఎం దిష్టిబొమ్మను దహనం చేయగా, ధర్మపురి పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు.



కరీంనగర్: తెలంగాణచౌక్ లో రేవంత్‌రెడ్డి చిత్రపటంతో నిరసన తెలుపుతున్న మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్లా హరిశంకర్, నాయకులు

### బీఆర్ఎస్ నాయకుడి ఆత్మహత్యాయత్నం



సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో ఆవేదన చెందిన ఓ బీఆర్ఎస్ నాయకుడు ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసే క్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మైలారం రాము ఒంటిపై డీజిల్ పోసుకున్నాడు. గమనించిన బీఆర్ఎస్ నాయకులు వెంటనే అతని అడ్డుకున్నారు. మహిళా ఎమ్మెల్యేలను అవమానపరచడంతో తాను ఆవేదన చెందానని రాము తెలిపాడు. తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాడు.



గోదావరిఖని: చౌరస్తాలో నినదిస్తున్న బీఆర్ఎస్ నేత దాసరి ఉష, మహిళా నాయకురాళ్లు

# నిరంకుశపాలన మాకొద్దు

- ఆర్టీవో అధికారుల వేధింపులు ఆపాలి
- ఆత్మహత్యలతో రోడ్డున పడ్డ కుటుంబాలను ఆదుకోవాలి
- కరీంనగర్‌లో పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్డు వర్కర్ల ఆందోళన



నిరసన తెలుపుతున్న జిల్లా పబ్లిక్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్డు వర్కర్స్ యూనియన్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

తెలంగాణచౌక్, ఆగస్టు 1: నిరంకుశ పాలన తమకొద్దని, స్పెషల్ డ్రైవ్ పేరుతో ఆటోడ్రైవర్లపై ట్రాఫిక్, ఆర్టీవో అధికారులు చేస్తున్న వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్డు వర్కర్స్ యూనియన్ నాయకులు నిరసనకు దిగారు. ఆ యూనియన్ (సీఐటీయూ) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ చౌక్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు స్కీంతో ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోయిందని, రోజు ₹200 కూడా ఆదాయం రాక కుంటుంబ పోషణ భారంగా మారిపోయిందని చెప్పారు. అసలే కిరాయిలు లేక ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లను టాప్ నెంబర్ లేదని, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ లేదని ట్రాఫిక్, ఆర్టీవో అధికారులు స్పెషల్ డ్రైవ్ పేరుతో తమను వేధిస్తున్నారని వాపోయారు. తాము ఫ్రీ బస్సు స్కీంకు వ్యతిరేకం కాదని, ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్, ఫిట్‌నెట్ ప్రభుత్వమే భరించాలని కోరారు. ₹12 వేల సాయం చేస్తామని ఎన్నికల టైంలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాన్ని సీఎం రేవంత్ రెడ్డి మరిచిపోయారని, అసలు ఆ విషయాన్నే ప్రస్తావించడంలేదని మండిపడ్డారు. బతుకు భారమై ఇప్పటివరకు 100 మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్యకు పాల్పడ్డారని, కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అంతకుముందు నిరసన తెలిపేందుకు సిద్ధపడుతున్న ఆటో డ్రైవర్లను పోలీసులు అడ్డుకోగా, వారి మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. ఇదేం నిరంకుశపాలన అని, నిరసనను అడ్డుకోవడం తమ హక్కులను హరించడమేనని ఆటో డ్రైవర్లు మండిడ్డారు. పోలీసుల ఒత్తిడితో బ్యానర్లు లేకుండానే నిరసన తెలిపారు. ఇక్కడ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రమేశ్, వెంకటేష్, సంపత్ పాల్గొన్నారు.

## రైస్‌మిల్లర్ రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

పెగడపల్లి, ఆగస్టు 1 : సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు పెగడపల్లి శివారులోని హరిహర మోడ్రన్ రైస్‌మిల్ యజమానిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ రఘు చందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హరిహర రైస్‌మిల్ యజమాని గంగం వెంకట్‌రెడ్డి ధాన్యం పట్టి సివిల్ సప్లై కార్పొరేషన్‌కు అప్పగించేందుకు 2022-23 సంవత్సరానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ మేరకు సివిల్ సప్లై కార్పొరేషన్ నుంచి ₹3 కోట్ల 10 లక్షల విలువైన 12,728 క్వింటాళ్ల ధాన్యం తీసుకొని సీఎంఆర్ బియ్యంగా మార్చి ఇవ్వాల్సి ఉంది. అయితే, వెంకట్‌రెడ్డి అక్రమాలకు పాల్పడి మోసం చేశాడని సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ హథీరామ్ ఫిర్యాదు మేరకు పెగడపల్లి ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం గురువారం రిమాండ్‌కు తరలించారు.


## ఆర్అండ్‌బీలో ఇంజినీర్ల బదిలీ

కలెక్టరేట్, ఆగస్టు 1 : కరీంనగర్ సర్కిల్ పరిధిలోని రహదారులు, భవనాల శాఖలో పలువురు అసిస్టెంట్ ఇంజినీర్లు బదిలీ అయ్యారు. కరీంనగర్‌లో ఏఈఈగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్‌రావు జాతీయ రహదారుల విభాగం జగిత్యాల సెక్షన్‌కు, అక్కడ పనిచేస్తున్న రాజశేఖర్ కరీంనగర్ బిల్డింగ్ సెక్షన్‌కు, కోరుట్లలో విధులు నిర్వహిస్తున్న మధు కరీంనగర్‌కు, మంచిర్యాల నుంచి సుధాకర్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయానికి, ఇక్కడ కొనసాగుతున్న ఇస్రత్‌ఖాతూన్ గంగాధరకు, అలాగే జగదీష్ మంచిర్యాల జాతీయ రహదారుల సెక్షన్‌కు బదిలీ అయ్యారు.

## దరఖాస్తుల ఆహ్వానం

మెట్‌పల్లి,ఆగస్టు 1 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మెట్‌పల్లి అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ గురువారం తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత లేదా సమానమైన ఇంటర్మీడియట్ నేషనల్ స్కూల్, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ, పాలిటక్నిక్ మూడేళ్ల కోర్సు, ఐటీఐ, డెయిరీ వొకేషనల్, ఓఏ, ఈఈటీ వంటి కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు నేరుగా డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చుని సూచించారు. బీఏ, బీకాం బీఎస్సీ, ఆర్ట్స్, కంప్యూటర్ గ్రూపుల్లో చేరేందుకు నిర్ణీత ఫీజు చెల్లించిన రసీదును, రెండు సెట్ల నకలు ప్రతులను స్థానిక అభ్యాసకుల కేంద్రంలో సమర్పించాలని తెలిపారు. డిగ్రీ రెండు, మూడో సంవత్సరం ఫీజులు చెల్లించేందుకు ఈ నెల 18 వరకు గడువు ఉందన్నారు.

## బ్యాంకులకు బారులు



ధర్మారంలోని యూబీఐ బ్యాంక్‌లో రైతులు

ధర్మారం, ఆగస్టు1: రుణ మాఫీ కష్టం వెంటాడుతూనే ఉంది. అర్హులందరికీ మాఫీ చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మొదటి, రెండు విడతల్లోనూ వేలాది మందికి మాఫీ కాక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. మొదటి విడత కానోళ్లు ఇప్పుడైనా అయ్యిందా అని, రెండో విడత లబ్ధిదారులు తమకు మాఫీ జరిగిందా..? లేదా..? అని తెలుసుకునేందుకు బారులు తీరుతున్నారు. గురువారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని యూబీఎస్, ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, సింగిల్ విండో కార్యాలయాల వద్ద కిక్కిరిసిపోయి కనిపించారు.